పొందు సంచలనమ్ము పొందుదు నప్పుడపుడు
సన్నని తీయని సన్నజాజిపూవులు
దర్శించువేళ!
ఇది—యీ యద్భుతావస్థ
పూర్వజన్మ ఖర్మసంబంధమో
నేటిదో యెరుంగలేనుగాని
ఈ యవస్థ—
అద్భుతానంత వేదనా మిళితమౌ
నొక యనుభవమ్ము—
నన్ను విజ్ఞాన పథాంచలముల కీడ్చు
ఏ నొక తేజోరాశివలె
విజ్ఞాన పథికువోలె దాని ననుసరింతు!

★

అవి సన్నజాజులు
తెల్లని తీపిపూలు
గడ్డిపూవులు
ఏవో పేరులేని సన్నజాజిలత
రాత్రులందె వికసించు పూలు
మీరు గ్రహించరా వాటిసొగసు!

---

కథానిక

# స్వాభిమానం

కంచి వాసుదేవరావు

"నీకు బాగుపడే గీతలేదురా!" అంటూ ఉప్పెనలా గదిలోకి వచ్చాడు మామయ్య!

నాకు బాగుపడడము చేతకాదని యిప్పటికి చాలామంది చెప్పారు. ముఖ్యముగా మామయ్య రోజు కొకసారయినా గుర్తు చేస్తాడు...... మామయ్య జరిపే దండయాత్రని, కిమ్మనకుండా సహించడానికి సిద్ధపడేవున్నాను.

"అదికాదురా! దొరక్క దొరక్క ఏదో నాగేశ్వర్రావు చలవవలన వుద్యోగము దొరికింది. ఏదో చిరాకులో యజమాని అన్నమాట పట్టుకుని నిక్షేపమువంటి వుద్యోగము మానుకుంటార్రా! రేపటినుంచి నీ గతేమిటీ?..."

"అదికాదు మామయ్యా..."

"నోర్మూసుకోరా! యింకా ఆ రాజీనామాని అంగీకరించి వుండడేమో వెళ్ళి ఆ నాగేశ్వర్రావుని ఆశ్రయించి, ఆ రాజీనామాని వుపసంహరించుకో!...వెర్రివెర్రి వేషాలు వేయక..." అంటూ దీనికో జవాబు వుంటుందని గమనించనయినా గమనించకుండా మామయ్య లోపలికి వెళ్ళిపోయాడు.

నేను వుద్యోగము మానుకున్న కారణాలని మామయ్య అర్థము చేసుకుంటాడన్న భ్రమ నాకులేదు.

నాగేశ్వరరావు...నా స్నేహితుడు...ఒక్క నాకే నేమిటి చాలమందికి స్నేహితుడు.."యీ పట్టణములో నా స్నేహితులు, మూడు అంకెల మీద వుంటారోయి" అంటుండేవాడు. అతని స్నేహాన్ని సంపాదించడానికి ప్రతివాడికి సమానార్హతలున్నాయి. ప్రతి వాడితోనూ మనసిచ్చి ఆప్యాయముగా మాట్లాడి తనపట్ల ఆకర్షణ నేర్పర్చుకోగలడు. అతనికి వుద్యోగము సద్యోగము చేయవలసిన అవసరములేకుండా, తండ్రి తాతలు సంపాదించిన ఆస్తివుంది...పలుకుబడి వుంది. ఎప్పుడూ స్నేహితులతో కబుర్లు చెబుతూ వుండడము. వాళ్ళకోసము డబ్బు ఖర్చుచేయడము తప్ప వేరు తాపత్రయంలేదు. అతని పలుకుబడిని స్నేహితులు గుర్తించాలని, తనెంతవున్నతస్థితిలో వున్నాడో గ్రహించాలని అతని ఉత్కంఠ.

"పైచదువులకి యింగ్లండుకి వెళ్ళాలనివుందా! అక్కడ మన హైకమిషనరుకొడుకు నేను ప్రాణస్నేహిలము..." అంటాడు ఓ మిత్రశ్రీతో.

"సినిమాల్లో హీరో అవ్వాలనివుందా? భానుమతి కొత్త పిక్చరు తీస్తోందట...భానుమతి మన మాట తీసేయదు! అందులో నీకో కేరక్టరు క్రియేటు చేయించమంటావా" అంటాడు మరింకోడితో.

నేను యింటరు ప్యాసయ్యాను. కుటుంబ పరిస్థితుల వత్తిడివలన చదువుకట్టి పెట్టి వుద్యోగము కోసము ప్రయత్నించవలసివచ్చింది. కానీ ఆరు నెలలు తన్నుకున్నా...నా చిన్న పలుకుబడితో ఉద్యోగము సంపాదించలేకపోయాను.

ఒకరోజున కాకతాళీయము నాగేశ్వరరావుని "మెరీనా"లో కలుసుకున్నాను. "ఏంచేస్తున్నావోయి" అని అతను నన్నడిగినమీదట "చీఫ్ మినిష్టరూ. నువ్వు, ఒక కంచములోతిని, ఒక మంచములో పడుకునేవారంటావు...గవర్నరు యింటర్వ్యూ యిచ్చాడంటావు...కానీ నాకో డెభ్భయిరూపాయలు చూపించలేవూ?"అన్నాను ఛలోక్తిగా అతనిమీద దెబ్బతీయాలని—నేను యీ మాటన్న ముహూర్తము ఎట్టాంటిదోకాని, ఆ మాట అతనిలో పౌరుషాన్ని రేపింది ... "చూసుకో వారము రోజులలో నీకు వుద్యోగము యిప్పిస్తా. యింక నీకు వుద్యోగము లేకపోవడము నాకు యిష్టట్లు... రేపురా! సరిగ్గా ఎనిమిదింటికి. ఎక్కడో అక్కడ యిరికిస్తా" నన్నాడు..సరేనని యింటికివచ్చాను..మళ్ళీ యీ విషయం గుర్తులేదు. నేను అతని మాటలకి ఎప్పుడూ విలువయివ్వలేదు. అతని కబుర్లలో అతిశయోక్తులుతప్ప ఏంవుండవని నాకు నమ్మకము...అదీగాక నా కోసము నిముషాలమీద వుద్యోగము సృష్టించగలడంటే నా వూహాకందని విషయము. మర్నాడు నేను వెళ్ళలేదు...తొమ్మిదింటికి అతనే కారువేసుకుని మా యింటికివచ్చాడు ... "యిదే యిండియన్ పంక్చ్యుయాలిటీ" అంటూ.

అతనూ నేనూ ఎనుగున్న కంపెనీలకి వెళ్ళాము. ఫలితము ఏమాత్రము నిరుత్సాహకరముగా లేదు.. నాకు రెండు మూడు రోజులలోనే తొంభయి రూపాయిల వుద్యోగము దొరికింది.

యీ రెండురోజులలో కనీసము రోజుకి అర డజనుమందయినా అతన్ని అటకాయించేవాళ్ళు.

"నిన్నసాయంత్రము మీ రూముకి వచ్చాను లేవే" అని ఒకడు—

"నిన్న నీ మూలాన మా ప్రోగ్రాం కాన్సలయింది. చాల డిసపాయింటు చేశా"వని మరొకడు-

"శవాళ న్యూ ఎలిఫిన్‌స్టనుకి వెళ్దాము వస్తావా"అని యింకొకడు. యిల్లా ప్రతివక్కరూ అతను లేకపోవడమే వెలితి అయినట్టు మాట్లాడే వారు.

అప్పుడు నాగేశ్వరరావు నన్ను పరిచయపరచి నా వుద్యోగము కోసము తిరుగుతున్నానని... పడ్తున్న కష్టాలు ఎవరెవర్ని కలుసుకున్నానో అన్నీ వివరించేడు విసుగులేకుండా.

"నువ్వు స్వయముగా వెళ్ళడమూ...యింకా దొరక్కపోవడమూ" అని వాళ్ళు అనేవారు.

"మా వాడు యింటరే ప్యాసయ్యాడు... అమాయకుడు...యీ రోజులలో గ్రాడ్యుయేట్లకి వుద్యోగాలు దొరకటంలేదు. అయినా నేను ప్రయత్నిస్తే రాకపోతుందా...రెండురోజులలో యితను ఉద్యోగస్థుడవక తప్పదు" అనేవాడు.

వాళ్ళు నావంక నేను పట్టి అప్రయోజకుడను నన్నట్టుగా...నామీద దయతలచి నాగేశ్వరరావు కష్టపడ్తున్నట్టుగా ఓ చూపు చూసేవారు. నాకు మటుకు చచ్చేటంత అభిమానము ముంచుకు వచ్చేది. నాగేశ్వరరావు రికమెండేషనే నాకున్న అర్హతన్నట్లు నా యింటరు క్వాలిఫికేషనూ, ఎందుకూ కొరగానిదన్నట్లు అతను భావించి అటు వంటి అభిప్రాయాన్నే అతని స్నేహితులముందు వెలిబుచ్చుతుంటే ఎందుకు తెచ్చుకున్నానా యీ తద్దినాన్ని అనిపించేది.

నాకు వుద్యోగం వచ్చిందంటే అతని పలుకుబడి వలనే! యీ విషయములో ఏమాత్రము సందేహపడ నవసరంలేదు. నేను ఈ విషయంలో అతనికి కృతజ్ఞుడుగానే వుంటాను.

ఉద్యోగములో చేరాను. రోజూ ఎవరోఒకళ్ళు కన్పించేవారు. నా స్నేహితులందర్నీ నాగేశ్వరరావుకూడా ఎరిగుండడము నా దురదృష్టము.

"ఏమోయి! యీమధ్య వుద్యోగముదొరక్క చాలా బాధపడ్డావుట. పోనీలే పాపము...నాగేశ్వరరావు ఏదో వుద్యోగము చూపించాడుట... అదృష్టవంతుడివిలే" అనేవారు.

పనిగట్టుకుని నాగేశ్వరరావు తన "లేటెస్టు ఎఛీవ్‌మెంటు" గురించి యీ "పబ్లిసిటీ" చేస్తున్నాడా అనిపించేది. అతను తన ప్రతిష్ఠ మిత్ర బృందములో పెంపుచేసుకోవడానికి యీ ప్రచా

రము మొదలెట్టియుండవచ్చుకాని, నాకుమటుకు చాలా బాధాకరముగా వుండేది. వాళ్ళందరి దృష్టిలో నేను అప్రయోజకుడ్ని. నాగేశ్వర్రావు దయవలన ఉద్యోగము దొరికింది.

ఆనాడు మామూలుగానే ఆఫీసుకు వెళ్ళాను. అనుభవము లేకపోవడము వలన ఓ తప్పు దొర్లింది. మేనేజరు పిలిచి ఆ తప్పు "పాయింటు" చేసి వుంటే బాగుండేది. "నాగేశ్వర్రావుమాట తీసేయలేక నీలాంటి "రా హేండ్సు"ని "అండరు గ్రాడ్యుయేటు"అని తీసుకున్నాకాని లేకపోతే నేనసలు నిన్ను ఎంగేజ్ చేసేవాడ్నికాదు" అన్నాడు.

ఆసలే నాగేశ్వర్రావు చేస్తున్న పబ్లిసిటీ వలన ఆత్మాభిమానము చాలా దెబ్బతినివుంది... ముందర నాగేశ్వర్రావు రికమండేషన్ పనిచేసి వుండవచ్చు కాని... నెలరోజులు కష్టపడి పనిచేసినందుకు నామీద సదభిప్రాయము మా మేనేజరుకు కలిగి వుండవలసింది. కాని మొగముముందు నువ్వు వట్టి చవటవి అనడము నాకు చాలా బాధకలిగించింది. ఉద్యోగము యిప్పించిన నాగేశ్వరరావుమీద, వుద్యోగము యిచ్చిన మేనేజరుమీద పట్టరాని ఆగ్రహము వచ్చింది. వళ్లు తెలియని ఉక్రోషం వచ్చింది.

"యిప్పటికీ నాకున్న అర్హత నాగేశ్వర్రావు సిఫార్సేనని మీరు భావిస్తుండే యీ వుద్యోగము చేయడము కష్ట"మన్నాను ఉబుకుతున్న ఉక్రోషాన్ని అణచుకుంటూ.

"కష్టమయితే నిరభ్యంతరముగా మానుకోవచ్చు" అన్నాడు మేనేజరు.

"యీ క్షణమే తప్పుకుంటా!... నాకూ ఆత్మగౌరవముంది"అని అక్కడికక్కడ రాజీనామా వుత్తరము వ్రాసియిచ్చి బయటపడ్డాను. కాని తొందరపడ్డానని మనసులో ఒకమూల బెరుకుగానే వుంది.

సాయంత్రము ఏదో ఘనకార్యము చేసినవాడివలె బయటికి నడిచాను. రేపటినుంచి మళ్ళీ మామూలు కథే రోడ్లుమీద మళ్ళీ "మిత్రులు" కన్పించారు. ఎల్లా తెలిసిందో వాళ్ళకి "ఏంటయ్యా! అంత తెలివితక్కువ పని చేశావుట, ఏదో అతను కష్టపడి యిచ్చిన వుద్యోగాన్ని కాలతన్నావుట" అనేవారు. "ఎవరు చెప్పారు?" అనడిగేవాడ్ని.

"అతనే."

"ఎలా తెలుసు?"

"మీ మేనేజరు అతనికి ఫోన్ చేసి నీ 'ఏరొగెన్సు' గురించి చెప్పాడుట."

ఇదివరకు ఎవరికయినా నేను తెలివిగలవాడినన్న భావముండేదేమో! యీపనితో ఆ భావము అందరికీపోయింది. నేను వుద్యోగానికి రాజీనామా యిచ్చి పట్టుమని ఆరుగంటలలు కాలేదు. అప్పుడే టముకువేశాడు. దీనివలన అతనిప్రతిష్ట పెరిగింది. నేను తెలివితక్కువవాడినయ్యాను...వుద్యోగము మాని సాధించినదేమిటి?

ఇంటికివెళ్ళాను రాత్రి ఎనిమిదింటికి. నాగేశ్వరరావు యింటికివచ్చాడు. వాడూ మామయ్యా నా అప్రయోజకత్వముగురించి చర్చిస్తున్నారు.

"చూడండీ, నాగేశ్వరరావుగారూ! మావాడు చాలా తొందరపాటు మనిషి. లోకజ్ఞానము లేనివాడు. ఎలాగో మేనేజరుతో చెప్పి ఆ వుద్యోగము నిలబెడ్దురూ! కావాలంటే క్షమార్పణ వుత్తరము వ్రాసియిస్తాడు" అంటున్నాడు మామయ్య.

"మీరంతగా చెప్పాలండీ; వాడిసంగతి నాకు చెప్పాలా? చిన్నప్పటినుండి అదే తంతు! మరి ప్రయత్నిస్తాను. అసలు వాడికిష్టమో లేదో తెలియొద్దూ?" అన్నాడు నాగేశ్వరరావు.

"ఆ పిచ్చివెధవ యిష్టమేమిటండీ. నా మాటవిని ప్రయత్నిద్దురూ" అని మామయ్య.

నా ఎదురుగుండా, నా యిష్టాయిష్టాలకి వ్యతిరేకముగా వీళ్ళిద్దరూ నన్ను "వట్టి పనికిమాలినవాడిగా" కట్టేస్తున్నారు. కోపమువచ్చింది ఉక్రోషము వచ్చింది. ఏంలాభము?

నిజమే. యిప్పుడు నాకు వుద్యోగము ఎక్కడ దొరుకుతుంది? అన్నీ దిగమింగుకుని వూరుకుంటే యీ వుద్యోగము నిలవవచ్చు. యీ వుద్యోగము చేయకపోతే యింటాబయటా అందరూ నాకు తాటాకులు కడ్తారు.

మళ్ళీ నాగేశ్వరరావు పలుకుబడివలన మానుకున్న వుద్యోగములో ప్రవేశించాను. "నాగేశ్వర్రావు మంచివలన కానీ, లేకపోతే అతనిని ఎరిగి ఎవరు పెట్టుకుంటారండీ" అని పరిచితులు అంటారని తెలుసు. అక్కరకురాని అభిమానముని చంపుకోక ఏంచేయను?

★